క్లుప్తంగా

పోలింగ్ కేంద్రం తనిఖీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని సత్యనారాయణపురంలోగల ఎస్‌టీవీఆర్ మున్సిపల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం పరిశీలించారు. స్కూల్ ప్రాంగణంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి ఎన్నికల నిర్వహణకు ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించే విధంగా ఏమీ ఉండకూడదని అధికారులను హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్, చుట్టుగుంట సబ్ స్టేషన్ 11కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. చుట్టుగుంట సిగ్నల్ ఏరియా, పాత ఏడో టౌన్ పోలీస్‌స్టేషన్ రోడ్, మాసల వీరన్న వీధి, మారుతీ నగర్ ఏలూరు రోడ్డు కొండ వైపు, కోకాకోల వీధి, మేయర్ వీధి, ఎంయస్ఆర్ వీధి, కాకతీయ కాలేజ్ రోడ్, భగత్‌సింగ్ రోడ్, వెంకటస్వామి వీధి, మొయిన్ అలీ బేగ్ స్ట్రీట్, మాచవరం మసీదు స్ట్రీట్, జమిందారు వీధి, సుంకరవారి వీధి, లలితమ్మ వీధి, మారుతీ నగర్, మాచవరం కొండ ప్రాంతం ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఎంసీఎంసీ, సోషల్ మీడియా విభాగాలను సందర్శించిన కలెక్టర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించే క్రమంలో తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను కలెక్టర్ ఢిల్లీరావు శనివారం సందర్శించారు. జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ), సోషల్ మీడియా సెల్, గ్రీవెన్సుల పరిష్కార కమిటీ తదితర విభాగాల అధికారులు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. నియమ నిబంధనలపై పూర్తిస్థాయిలో అవగాహనతో అప్రమత్తత, నిబద్ధతతో పని చేయడం ద్వారా ఎన్నికలను విజయవంతం చేయడంలో కీలక భాగస్వాములు కావచ్చని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని వివరించారు.

27న హుండీ లెక్కింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీ దాసాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 27వ తేదీ బుధవారం దేవదాయశాఖ ఉన్నతాధికారులు, సేవాసంఘం సభ్యుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందని అన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు సంప్రదాయ దుస్తులతో హుండీ లెక్కింపులో పాల్గొనవచ్చని ఆమె తెలిపారు.

నున్నలో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవాలు శైవాగమ ప్రకారం శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం దీక్షాధారణ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, హోమశాల ప్రవేశం జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి పూజాది కార్యక్రమాలు విశేషంగా తిలకించి నీరాజన తీర్థప్రసాద కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్.అరుణ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు ఎం.ఫణికుమార్ నేతృత్వంలో సాంప్రదాయబద్ధంగా జరిగాయి. సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కలరా హాస్పటల్ ప్రాంతానికి చెందిన భరణి భవానీకి రెండేళ్లగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ఈ నెల 13వ తేదీన చర్చికి వెళ్లి వస్తానని చెప్పిన భవానీ ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన చెల్లెలు పప్పు వెంకట రమణ చుట్టు పక్కల, బంధువుల ఇంట విచారించింది. అయినా భవానీ జాడ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదు చేశారు.

మళ్లీ జగనన్నే రావాలి

సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



వాంబేకాలనీలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

పాయకాపురం(విజయవాడరూరల్): పేదలందరికీ సంక్షేమ పథకాలు ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 61వ డివిజన్ వాంబేకాలనీలో శనివారం ఆయన పర్యటించారు. వాంబేకాలనీలోని హెచ్ బ్లాక్ నందు ఎమ్మెల్యే వెలంపల్లి అపార్టుమెంట్లలో ప్రతీ గడపకు వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేసి ఫ్యాను గుర్తుకు మీ ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు వెలంపల్లి శ్రీనివాసరావుకు హారతులిచ్చి స్వాగతం పలికారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని ఎన్నికలు అయిన వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ జగనన్న వస్తేనే మళ్లీ మాకు పథకాలు వస్తాయని ప్రజలు అంటున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, చంద్రబాబు వస్తే పథకాలన్నీ ఆగిపోతాయని పేద ప్రజలు భయపడుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ అభ్యర్థి బొండా ఉమా ఏనాడు ప్రజల కష్టాలు తెలుసుకోలేదన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకోలేని ఉమాకు వారిని ఓట్లు అడిగే అర్హతలేదన్నారు. బొండా ఉమా పేరు ఇక నుంచి మైసూరు బొండాగా నామకరణం చేశామన్నారు. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ఈ బ్లాకులు అన్ని తిరగాలని హితవు పలికారు. రాత్రి సమయాల్లో వచ్చి ప్రజలను బెదిరిస్తున్నారని చెబుతున్నారని, ఆయన బెదిరింపులకు ఎవరూ భయపడరని అన్నారు. మైసూర్ బొండాకు సరైన రీతిలో సినిమా చూపిస్తా అని చెప్పారు. నువ్వు మూడు కండువాలు కప్పుకుని ప్రచారం చేయాలని, నేను ఒక్క కండువా కప్పుకుని ప్రచారం చేస్తానని, మా ధైర్యం సీఎం జగన్ అని అన్నారు. బొండా ఉమా రౌడీషీటర్లతో రాజకీయం చేస్తున్నాడని ఆరోపించారు.

డ్రగ్స్ కేసు మూలాలు దగ్గుబాటి–నారా కుటుంబాల నుంచి..

విశాఖపట్నం డ్రగ్స్ కేసు మూలాలు దగ్గుబాటి, నారా వారి కుటుంబాల నుంచి వస్తున్నాయని అందరికి తెలుసునని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కంపెనీకి గతంలో పురందేశ్వరి కొడుకు పార్టనర్‌గా ఉన్నాడని, నారా లోకేష్ తోడల్లుడికి బంధువు ఇద్దరూ చంద్రబాబు సామాజిక వర్గమే. ఎన్నికల కోసం యువతను తప్పుదోవ పట్టించేందుకు చంద్రబాబు అండ్ కో పని చేస్తోందన్నారు. పట్టుకోబట్టి బండారం బైటపడిందన్నారు. యువతను మత్తులో పెట్టి ఓట్లు వేయించుకునేందుకు సిద్ధం అయ్యాడని విమర్శించారు. ప్రధాన మంత్రి మోడీ పార్టీలకతీతంగా సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, వెంకట్రావ్, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శి మేడా రమేష్, పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా, డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, ఆర్ఎస్ నాయుడు, రఫీ, వెంకటేశ్వరావు, నాగమణి, దుర్గాప్రసాద్‌రెడ్డి, నబీ, డివిజన్ ఇన్‌చార్జి రాజశేఖర్, మాలకొండయ్య పాల్గొన్నారు.

జగనన్నను నిండు మనస్సుతో ఆశీర్వదించాలి



27వ డివిజన్‌లో సంక్షేమ కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కులమత, రాజకీయాలకు అతీతంగా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని సెంట్రల్ అభ్యర్థి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కోరారు. స్థానిక 27వ డివిజన్ దుర్గాపురంలో శనివారం సాయంత్రం కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూ ప్రజలతో మమేకం అయ్యి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, వివిధ పథకాల లబ్ధిదారులు హారతులు ఇస్తూ వెలంపల్లి శ్రీనివాసరావుకు ఘన స్వాగతం పలికారు. నవరత్నాలతో తమ జీవితాల్లో వెలుగులు నింపిన జగనన్న ప్రభుత్వానికి ఓటు వేసి కొంతయినా రుణం తీర్చుకుంటామని వారు అన్నారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని అన్నారు. ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన సీఎం జగనన్నకు బాసటగా నిలవాలని ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

సిటీ బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని వినతి..

దేవీనగర్ నుంచి దుర్గాపురం మీదుగా మంగళగిరి ఎయిమ్స్, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్‌లకు సిటీ బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బీ వసంతకుమార్ వెలంపల్లి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. సిటీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ఆటోలకు అధిక ఛార్జీలు చెల్లించాల్సి వస్తుందని అన్నారు. సాధ్యమైనంత త్వరలోనే సిటీ బస్సు పునరుద్ధరిస్తామని వెలంపల్లి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కమ్మిలి రత్నకుమార్, కురిటి శివ, కొండాయగుంట రాము, శీలం భవానీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయసాధనకు కృషి చేయాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశం కోసం సర్వస్వం త్యాగం చేసిన మహనీయులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఐఎస్ఏ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు మహేష్ పిలుపునిచ్చారు. స్థానిక త్రివేణీ డిగ్రీ కళాశాలలో శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆనాడు వాళ్లు చేసిన పోరాటాలు, ఉద్యమాలు నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): డివైడర్‌ను ఢీకొని యువకుడు గాయపడిన ఘటన శనివారం గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోలే రత్నరాజు(23) రామవరప్పాడు రింగ్ సెకండ్ ఫ్లై ఓవర్ ముస్తాబాద్ దగ్గరకు వచ్చేసరికి ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొని పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రత్నరాజును స్నేహితుడు దుర్గాప్రసాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని నచ్చిన రంగంలో రాణించాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. కళాశాలలో శనివారం 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ టాయ్స్' ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో 30 మంది విద్యార్థులు 45 రోజుల పాటు 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ టాయ్స్'లో శిక్షణ తీసుకున్నారని చెప్పారు. డిగ్రీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని వివిధ బొమ్మల తయారీతో పాటు పేపర్ బ్యాగుల తయారీలో శిక్షణ తీసుకున్నారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పొన్నం శైలజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ స్కూల్‌లో 'గ్రాడ్యుయేషన్ డే' వేడుకలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ ఆశాజార్జ్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ సెయింట్ ఆన్స్ స్కూల్‌లో 'గ్రాడ్యుయేషన్ డే' వేడుకలు శనివారం సందడిగా జరిగాయి. సింగ్‌నగర్ ఆర్సీఎం చర్చ్ ఫాదర్ గడ్డం జోజి ముఖ్య అతిథిగా విచ్చేసి గ్రాడ్యుయేషన్ గౌనుల్లో ఉన్న యూకేజీ చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటితరం చిన్నారుల పట్ల తల్లిదండ్రులు అత్యంత శ్రద్ధను కలిగి ఉండాలని, ముఖ్యంగా వారికి మన సంస్కృతి, సాంప్రదాయాలు, పెద్దలంటే గౌరవ మర్యాదలను నేర్పించాలని సూచించారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగంలో వారిని ప్రోత్సహించినట్లయితే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందించిన వారిమవుతామన్నారు. చదువు, క్రీడలు ఇలా అన్ని రంగాల్లో వారిని ప్రావీణ్యులుగా తీర్చిదిద్దాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంయుక్తంగా చేయూతనందించడం వలనే అది సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ నిస్సీ థామస్, ప్రిన్సిపాల్ ఆశాజార్జ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన యువకులు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన వందమంది యువకులు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. సింగ్‌నగర్ నందమూరినగర్‌లోని సెంట్రల్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పత్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నగర మార్కెట్‌లోకి మహీంద్ర ఎలక్ట్రిక్ కారు



రామవరప్పాడు: ప్రసాదంపాడులోని మహీంద్ర షోరూంలో సరికొత్త ఎక్స్‌యూవీ 400 ఎలక్ట్రిక్ కారును మహీంద్ర ఆటోమోటివ్ మాన్యుఫాక్చరర్స్ సీఈఓ సంతోష్‌కుమార్ శనివారం నగర మార్కెట్‌లోకి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ సరికొత్త ఎలక్ట్రిక్ కారు మరింత పవర్‌తో, సమర్థవంతమైన బ్యాటరీ కెపాసిటీతో రూపొందించామన్నారు. మార్కెట్‌లో లభించే ఎలక్ట్రిక్ కార్ల కన్నా ఈ కారు తక్కువ ధరలో లభిస్తుందని చెప్పారు. వినియోగదారుల సౌకర్యార్థం డెమో కార్లు షోరూమ్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 31వ తేదీలోగా కారును బుక్ చేసుకున్న వారికి ప్రత్యేక ధరతో పాటు మరిన్ని బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారులు, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరం నడిబొడ్డున ఠీవిగా...



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బెజవాడ నగరం నడిబొడ్డున ఏర్పాటుచేసిన చారిత్రక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం అత్యంత అద్భుతంగా, ఠీవిగా ఉందని ప్రజలు అంటున్నారు. నగరాన్ని ఎత్తు నుంచి ఎటువైపు చూసినా అంబేద్కర్ విగ్రహం ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. విజయవాడ నగర అందాల మధ్య కన్పిస్తున్న బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రమిది. సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వైఎస్సార్ సీపీకి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి



58వ డివిజన్‌లో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా విప్లవాత్మక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించిన వైఎస్సార్ సీపీకి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ అన్నారు. 58వ డివిజన్‌లో శనివారం ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఆమె ఇంటింటికి తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అఫ్రోజ్, వరలక్ష్మి, వసంత్, శోభనాలు తదితరులు పాల్గొన్నారు.

59వ డివిజన్‌లో..

సింగ్‌నగర్ 59వ డివిజన్‌లో కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా ప్రచార కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. నిరుపేద ప్రజల తలరాతలను మార్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ప్రజలంతా నడవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, కంభగళ్ల రాజు, నందెపు సురేష్, దేవిరెడ్డి రమేష్‌రెడ్డి, షేక్ అమిత్ పాల్గొన్నారు.

కళాకారుల ప్రతిభను ప్రోత్సహించాలి



సంగీత విద్వాంసురాలు సుధాశ్రీనివాస్‌ను సత్కరిస్తున్న రమాసత్యనారాయణ తదితరులు

విజయవాడ కల్చరల్: కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని విశ్వమాత చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. డ్రీమ్ ఆడియో, మహానటి సావిత్రి కళాపీఠం ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సంగీత విద్వాంసురాలు సుధాశ్రీనివాస్‌కు ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాసత్యనారాయణ మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని వారికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంటుందన్నారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ సుధారాణి దేశ విదేశాల్లో వందలాది సంగీత కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, కళా సాంస్కృతిక రంగాల ప్రముఖులు చింతకాయల చిట్టిబాబు, ఉమాబలరాం, ప్రసూనారామన్, మహ్మమద్ ఖాజా, బొడి ఆంజనేయరాజు, అశోక్‌ఆనంద్ సుధాశ్రీనివాస్ సంగీత సేవలను వివరించారు. నిర్వాహకులు సుధాశ్రీనివాస్‌ను ఆత్మీయంగా సత్కరించారు. నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు.

భక్తులకు భోజనాలు



ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదాన పథకంలో భాగంగా రోజూ భక్తులకు భోజనాలు పెడుతున్నారు. గాలిగోపురం వద్ద రాత్రివేళ కూడా అన్నప్రసాదం అందిస్తున్న చిత్రమిది.
సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కోడ్ ఉల్లంఘిస్తూ బొండా షి'కారు'..!



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల ప్రవర్తన నియమావళి(కోడ్) అమల్లోకి వచ్చి ఎనిమిది రోజులవుతున్నా సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమా నిబంధనలు పాటించకుండా తిరుగుతున్నారు. తన ఫొటో ముద్రించిన తార్ కారుపై ఉమాతో పాటు ఆయన తనయులు, టీడీపీ నాయకులు యథేచ్ఛగా చక్కర్లు కొడుతున్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఇలాగే టీడీపీ నాయకులు తమ వాహనాలపై స్టిక్కర్లను తొలగించకుండా తిరుగుతున్నారు. దీనిపై ఎన్నికల అధికారులు పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

9 నుంచి వసంత నవరాత్రి మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన వచ్చే నెల తొమ్మిది నుంచి 18వ తేదీ వరకు వసంత నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ నీలకంఠేశ్వర స్వామివారికి అభిషేకం జరుగుతుందన్నారు. అమ్మవారికి ఉదయం 10 గంటలకు సుహాసినిలతో సామూహిక కుంకుమార్చన, రోజుకు ఒక విశేష ద్రవ్యములతో అర్చన జరుగుతాయని తెలిపారు. సాయంత్రం 7 గంటలకు ఖడ్గ మాలార్చన అనంతరం హారతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. 9వ తేదీన పసుపు, కుంకుమ, 10న గంధం, అష్ట గంధం, 11న తమలపాకులు 12న వివిధ రకాల పూలు 13న పలు రకాల పండ్లు 14న కొబ్బరికాయలు 15న తులసీ, మారేడు, మరువములతో పూజలు చేయడం జరుగుతుందని చెప్పారు. 16న శాకంబరీ అమ్మవారిగా 17న గాజులతోనూ, 18న చీరలతోను ప్రత్యేకంగా అర్చనలు, అలంకరణ జరుగుతాయన్నారు. 17వ తేదీ శ్రీరామ నవమి సందర్భంగా ఉదయం 10 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం వేదపండితుల మంత్రోచ్చారణలతో జరుగుతుందన్నారు. భక్తులు వసంత నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.